Truth of News

సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

రాయలసీమ జిల్లాలు

మంగళవారం | 25 జూన్ 2024 | పేజీలు 8

# తిరుమల శ్రీవారి ఆలయంపై ఈవో సమీక్ష



**తిరుమల సూర్య వాస్తవం:** తిరుమల శ్రీవేంకటేశ్వర ఆలయం, చరిత్ర, వాస్తుశిల్పం, విశిష్టత మరియు అనేక ఇతర సంబంధిత విశేషాలపై టీటీడీ ఈవో జె.శ్యామలరావు సవివరంగా సమీక్షించారు. సోమవారం సాయంత్రం తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో జరిగిన సమీక్షా సమావేశంలో జేఈవోలు గౌతమి, శ్రీవీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిరుమల శ్రీవారి ఆలయ చరిత్ర, వైఖానస ఆగమ, జీయంగార్ వ్యవస్థ, వివిధ ఆచార వ్యవహారాలు, నిత్య, వార, మాస, వార్షిక సేవా కార్యక్రమాలు, సుప్రభాతం నుంచి ఏకాంతం వరకు ప్రతిరోజు శ్రీవేంకటేశ్వర స్వామికి నిర్వహించే వివిధ కైంకర్యాలను సవివరంగా ఈవోకు వివరించారు.తరువాత ఆయన ఉదయం సేవలు, విఐపి దర్శనం, సర్వ దర్శనం, ఆర్జిత సేవలు, ఇతర దర్శనాలను కూడా సమీక్షించారు.భక్తులకు కల్పిస్తున్న వివిధ రకాల దర్శనాలు, ఇందుకు సంబంధించిన దర్శన సమయము, ఏదర్శనానికి ఎంత సమయం పడుతోంది తదితర అంశాలపై మిగతా 2లో

# అంధకారంలో ప్రభుత్వ కార్యాలయాలు




**నల్లచెరువు (సూర్య వాస్తవం):** నిత్యం ప్రజలకు సేవలు అందించే ప్రభుత్వ కార్యాలయాల పరిరక్షణ కట్టుదిట్టంగా ఉండాలి అందులోని రికార్డులు ఇతర విలువైన వాటి రక్షణకు పటిష్ట భద్రత కల్పించాలి.అయితే నల్లచెరువు మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు ఇందుకు భిన్నంగా ఉన్నాయి.పగలు విధులు నిర్వర్తించి వెళ్లిన ఉద్యోగులు అధికారులు రాత్రివేళ కార్యాలయ బాధ్యత తమది కాదన్నట్లుగా వ్యవహరించడం మండల వ్యాప్తంగా పలు విమర్శలకు తావిస్తోంది. మండల పరిషత్ కార్యాలయం,తహసిల్దార్ కార్యాలయం, గ్రంధాలయం, ప్రభుత్వ వైద్యశాల ప్రజలకు వివిధ రకాల సేవలు అందించే పలు కార్యాలయాలు నిత్యం అంధకారంలోనే ఉంటున్నాయి. కార్యాలయాల బయట విద్యుత్ దీపాలు లేక సాయంత్రం ఆరు గంటలు దాటితే ఈ ప్రాంతాలను మొత్తం చిమ్మచీకటి కమ్మేస్తోంది. చుట్టుపక్కల నివాస ప్రాంతాలు ఉన్నప్పటికీ ఇక్కడి చీకటి భయానక దృశ్యాన్ని తలపిస్తోంది.ఒకే వీధిలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం తహసీల్దార్ కార్యాలయం గ్రంథాలయం ప్రభుత్వ వైద్యశాల తదితర కార్యాలయాలు ఉన్నాయి.కానీ ఏ కార్యాలయానికి బయట వీధి దీపాలు వెలగడంలేదని మండల ప్రజలు వాపోతున్నారు.తాహసిల్దార్ కార్యాలయంలో భూ రికార్డులు,పట్టాదారు పాసుపుస్తకాలు, విలువైన సామాగ్రి వంటివి ఉంటాయి.చిమ్మ చీకటిలో ఎప్పుడు ఏ ఘటన చోటు చేసుకుంటుందోనని మండల ప్రజలు వాపోతున్నారు.గ్రంథాలయంలో విలువైన విద్యార్థులకు ఉద్యోగులకు మిగతా 2లో

# ముఖ్యమంత్రిని కలసిన బత్యాల



**రాజంపేట సూర్య వాస్తవం:** మంత్రిమండలి సమావేశం సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజంపేట నియోజకవర్గ ఇంచార్జ్ బత్యాల చంగల్ రాయుడు సోమవారం నాడు వెలగపూడి లోని సెక్రటరియట్(రాష్ట్ర సచివాలయం)కు వెళ్లి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రంలో కూటమి విజయం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం జలవనురుల శాఖ మంత్రి వర్యులు (ఇరిగేషన్ మినిస్టర్) నిమ్మల రామానాయుడు మరియు ప్రొఫెషన్ అండ్ ఎక్సైజ్ మంత్రి వర్యులు కొల్లు రవీంద్ర గార్లని కలిసి వారికి కూడా శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే వారి ఇరువురితో రైల్వే కోడూరు, రాజంపేట నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్కసం సునీల్, పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.వెంకటసుబ్బయ్య యాదవ్, యూత్ లీడర్ మహేష్ నాయుడు, సింగనమల నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# కష్టాలను ధైర్యంగా ఎదుర్కొందాం : వైఎస్ జగన్



## -ఎవరూ అధైర్యపడొద్దు, రాబోవు కాలం మనదే : వైఎస్ జగన్

**కడప సూర్య వాస్తవం:** పులివెందులలోని భాకరాపురంలో ఉన్న క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కార్యకర్తలు, ప్రజలు, నేతలు, అభిమానులతో మమేకమయ్యారు. అందరినీ పేరుపేరునా పలకరించి వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ నేతలతో కూడా చర్చించారు. కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్యపడవద్దు, పార్టీ అండగా ఉంటుందని, అందరం కలిసి కట్టుగా ముందుకు వెళ్ళాల్సిన అవసరం ఉందని వివరించారు. రానున్న కాలంలో ప్రతీ కార్యకర్తకు తనతో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తోడుగా ఉంటుందని వైఎస్ జగన్ భరోసానిచ్చారు. మనం చెప్పిన మంచి పనులన్నీ చేశాం, మనం చేసిన మంచి ప్రతీ కుటుంబంలో ఉంది, అందుకే ప్రజలకు మన పైనే విశ్వాసం ఉందని వైఎస్ జగన్ అన్నారు. నిరంతరం ప్రజాశ్రేయస్సుకు అనుగుణంగా అడుగులు వేయాలని శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. మిగతా 2లో

# ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

- ఎస్.పి. సిద్దార్థ్ కౌశల్



వివరాలు 2లో

## దయగల దాత లారా ఆదుకోండి... తల్లిదండ్రులు ఆవేదన



**రైల్వే కోడూరు (సూర్య వాస్తవం):**రైల్వే కోడూరు నియోజకవర్గం చిట్వేలు మండలం తుమ్మకొండ గ్రామానికి చెందిన మనోహర్ కూలి పనులకు వెళితే గాని కడుపు నిండని కుటుంబంలో పుట్టిన మూడో తరగతి చదువుతున్న చిన్నారి తేజశ్రీకి బ్రెయిన్‌లో కణితి రూపంలో కొంత కష్టం వచ్చింది. చిట్వేల్ మండలం తుమ్మ కొండకు చెందిన మనోహర్, కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించు కుంటున్నారు. కన్న బిడ్డకు కష్టం రావడంతో దిక్కుతోచక పరిస్థితులలో దాతల నుంచి సహాయం కోరుతున్నారు. ప్రస్తుతం చిన్నారి ఏలూరు సీఎంసిలో చికిత్స పొందుతూ ఉంది. దయగల మనసున్న దాతలు చిన్నారి తేజశ్రీ చికిత్సకు సహాయం అందించాలని దయగల వారిని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

## అర్జీదారులకు న్యాయమైన పరిష్కారం చూపాలి..!

### -తహసిల్దార్ ఉమారాణి - ఎంపీడీవో సుగుణ శ్రీ



**దువ్వూరు, సూర్య వాస్తవం :** మండల ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించే అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని తహసిల్దార్ ఉమారాణి, మండల అభివృద్ధి అధికారి సుగుణ శ్రీలు మండల అధికారులను ఆదేశించారు. సోమవారం మండల తహసిల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల తహసిల్దార్ ఉమారాణి, మండల అభివృద్ధి అధికారి సుగుణ శ్రీలు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అర్జీలకు అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ జరిపి వారికి న్యాయం చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు వివిధ రకాల అర్జీలు అందించారు .వీటిని వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరించాలని మండల అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి. అమర్నాథ్ రెడ్డి, ఈ ఓపిఆర్డి శివప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, విద్యుత్ శాఖ ఏఈ బి. వీరారెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ సుబ్రహ్మణ్యం, వెలుగు ఏపీఎం శ్రీధర్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు వరలక్ష్మి, సౌజన్య, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్ట్



**రాజంపేట టౌన్ సూర్య వాస్తవం:**అన్నమయ్య జిల్లా...రాజంపేట పరిధిలోని తుమ్మలబైలు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించిన టాస్క్ ఫోర్స్ పోలీసులు...ఎర్రచందనం అక్రమ రవాణాకు చేస్తున్న తమిళనాడుకు చెందిన ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్ట్...వీరి వద్ద నుంచి 5 ఎర్రచందనం దుంగలు స్వాధీనంమరి కొంతమంది ఎర్రచందనం స్మగ్లర్లు కోసం గాలింపు చర్యలు చేపట్టిన టాస్క్ ఫోర్స్ పోలీసులు..ఈ కార్యక్రమం లో టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## రెడ్డి సేవా సంఘం సహకారంతో శివోహం వారి అన్నప్రసాద వితరణ

**ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం):** శివోహం అన్నప్రసాద సేవా సంఘం వారి ఆధ్వర్యంలో సోమవారం రెడ్డి సేవా సంఘం వారి ఆద్వర్యంలో ప్రజలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా శివోహం అన్నప్రసాద సేవా సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద సేవను తాము నిర్విరామంగా కొనసాగిస్తున్నామని, ఈ తరుణంలో సోమవారం రెడ్డి సేవా సంఘం సహకారంతో నిర్వహించిన అన్నప్రసాద సేవలో అధ్యక్షుడు డాక్టర్ నాగదస్తగిరి రెడ్డి పాల్గొని దాదాపు 800 మందికి అన్న ప్రసాదం అందజేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో శివోహం కమిటీ ఉపాధ్యక్షుడు మురుకూటి సూర్యనారాయణ, సభ్యులు విష్ణు నారాయణ, విజయకుమార్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అంధకారంలో ప్రభుత్వ కార్యాలయాలు

**(మొదటి పేజీ తరువాయి)**ఉపయోగపడే పుస్తకాలు,పూర్వపు గ్రంధాలు వంటివి ఉంటాయి.కార్యాలయానికి రాత్రిపూట దీపాలు వేసి వాటికి భద్రత కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధికి సంబంధించిన రికార్డులు విలువైన సామాగ్రి వంటివి ఉంటాయి.రాత్రి సమయాల్లో వీధి దీపాలు లేకపోవడంతో వాటికి భద్రత ఎక్కడ ఉంటుందని మండల ప్రజలు వాపోతున్నారు. ఇటు పక్కనే ఉన్న ప్రభుత్వ వైద్యశాల ముందు లైట్లు వెలుగుతున్నప్పటికీ లోపలికి వెళ్ళు గేటు వద్ద దీపాలు వెలకకపోవడంతో చిమ్మ చీకటిగా ఉంటోంది.దీని కారణంగా రాత్రి సమయాల్లో అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రిలోకి వెళ్ళు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.దీంతోపాటు మండలంలోని పలు వీధులలో కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు.సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల ముందు రాత్రి సమయాల్లో వెలుగులు నింపే కార్యక్రమం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## తిరుమల శ్రీవారి ఆలయంపై ఈవో సమీక్ష

**(మొదటి పేజీ తరువాయి)**సవివరంగా తనకు నివేదిక పంపవలసిందిగా ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథంను ఆయన ఆదేశించారు. అంతకుముందు ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నారాయణగిరి షెడ్లను ఈఓ పరిశీలించారు. యాత్రికుల రద్దీని సమర్థవంతంగా నిర్వహించడం గురించి కొన్ని విలువైన సూచనలు ఇచ్చారు.ఈ తనిఖీలో ఇద్దరు జేఈవోలతో పాటు సీవీఎస్వో నరసింహ కిషోర్, సిఈ నాగేశ్వరరావు, ఎస్ఈ -2 జగదీశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# కుప్పం ఆర్టీసీ డిపోకి పూర్వవైభవం

**కుప్పం, సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత మొదటిసారి కుప్పం నియోజకవర్గ పర్యటనకు వస్తున్న నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బస్సు సర్వీసులు లేక నిర్వీర్యమైన కుప్పం డిపోకు కొత్త బస్సులు రానున్నాయి.గతంలో కుప్పం డిపో లో 98 బస్సు సర్వీసులు,104 బస్సులు వుండేవి,2019 సంవత్సరం ఎన్నికల తరువాత తిరుమల, అలిపిరి, పుంగనూరు మరియు పలమనేరు డిపోలకు దాదాపు 38 సర్వీసులను, సిబ్బందిని తరలించారు.ఈ నేపథ్యంలో తెలుగు దేశం పార్టీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే వివిధ కారణాలతో వివిధ డిపోలకు వెళ్లిన సర్వీసులు, బస్సులు మరియు సిబ్బందిని కుప్పం డిపోకు వెనక్కి రప్పిస్తున్నారు.ఈ సందర్భంగా కుప్పం డిపో ఆవరణలో సోమవారం డిపో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నేతలు సత్యేంద్ర శేఖర్ రాజ్కుమార్, డాక్టర్ వెంకటేష్, జాకీర్ అహ్మద్, ఫైరోజ్ బాషా ఎన్.ఎం.యు.ఏ. జిల్లా అధ్యక్షులు ఎ.వేలు, జంపనూరు శ్రీను,డిపో చేర్మెన్ బొట్టు మణి, వర్కింగ్ ప్రెసిడెంట్ యం.జి.ప్రసాద్, డిపో కార్యదర్శి జయపాల్, సంయుక్త కార్యదర్శి జి.మునెప్ప, గ్యారేజ్ కార్యదర్శి రహంతుల్లా, సహాయ కార్యదర్శి నారాయణ, శ్రీనివాసులు, బాలబ్రహ్మం, జగ్గయ్య,ప్రసాద్, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.




## ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

### - ఎస్.పి. సిద్దార్థ్ కౌశల్

**కడప సూర్య వాస్తవం:** జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగుచర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమంలో బాధితులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.సైబర్ క్రైమ్ బారిన పడ్డ బాధితులు ఫిర్యాదు మేరకు సంబంధిత పోలీస్ అధికారులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్.పి సూచించారు.



## మంత్రి నారా లోకేష్ కలిసిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

**చిత్తూరు, సూర్య వాస్తవం:** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను టిడిపి కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా సచివాలయంలో కలిశారు. సోమవారం సచివాలయం 4వ బ్లాక్ లోని రూమ్ నెంబర్ 208 లో మంత్రి నారా లోకేష్ పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ ను వేద పండితులు ఆశీర్వదించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మంత్రి నారా లోకేష్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కుప్పం నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆయనతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

## కష్టాలను ధైర్యంగా ఎదుర్కొందాం : వైఎస్ జగన్

**(మొదటి పేజీ తరువాయి)**ఈ సందర్భంగా పులివెందులలోని క్యాంపు కార్యాలయం కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ప్రజలతో కిక్కిరిసిపోయింది. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు నేతలు అండగా నిలబడాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులకు వైఎస్ జగన్ సూచించారు.

## ఎన్‌సిసి శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ధృవ పత్రాలు వితరణ

**రైల్వే కోడూరు/చిట్వేల్ (సూర్య వాస్తవం):**రైల్వే కోడూరు నియోజకవర్గం చిట్వేలు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్ సిసి విద్యార్థులు చిత్తూరులో జరిగిన వార్షిక శిక్షణ శిబిరంలో పాల్గొని శిక్షణను పూర్తి చేసుకున్నట్లు ఎన్ సిసి ట్రూప్ కమాండర్ రాజశేఖర్ తెలిపారు. వెపన్ ట్రైనింగ్, డ్రిల్, ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులు శిక్షణను పొందారన్నారు. సోమవారం నాగసాత్విక, సాహితీ, రక్షిత, సాదక్, హరికుమార్, నాగ శివ విద్యార్థులకు శిక్షణ ధ్రువ పత్రాలను అందజేశారు.



## దువ్వూరును డయోరియా రహిత మండలంగా మార్చాలి



దువ్వూరు, సూర్య వాస్తవం : దువ్వూరు మండలం ను డయోరియా రహిత మండలం గా మార్చేందుకు మండలంలోని అన్ని గ్రామాల అధికారులు కృషి చేయాలని మండల అభివృద్ధి అధికారి ఎస్. సుగుణ శ్రీ పేర్కొన్నారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో డయేరియా మరియు ఇతర సీజనల్ వ్యాధుల పైన మండలంలోని అందరూ పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి ఎస్. సుగుణ శ్రీ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో నీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేసి ప్రతి ట్యాంకు కోరినేషన్ చేసిన నీటిని ప్రజలకు అందించాలని మరియు గ్రామాల్లో నీరు నిలువ లేకుండా మరియు అప్పటికప్పుడు ప్రిపేర్ చేస్తూ, త్రాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ప్రజలకు ఎటువంటి అంటూవ్యాధులు ప్రబలకుండా అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్సులు, ఇతర సచివాల సిబ్బంది సహకారం తీసుకొని ప్రజల ఆరోగ్యాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మండల విస్తరణాధికారి జి. శివప్రసాద్, ప్రభుత్వ వైద్యాధికారి సురేష్ బాబు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు,ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## పార్థిదేహానికి నివాళులర్పించిన ముక్కా వరలక్ష్మి



రైల్వే కోడూరు (సూర్య వాస్తవం):రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం, మంగళంపల్లి పంచాయతీలో మారావరపల్లి కి చెందిన మారా చంద్రశేఖర్ రెడ్డి తండ్రి శివశంకర్ రెడ్డి పార్థివ దేహానికి సోమవారం రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ముక్కా రూపానంద్ రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి పూలమాల వేసి వారికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన బిజెపి నాయకులు తదితరులు, మారవారిపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## యువతి హత్య కేసులో ముద్దాయికి శిక్ష

ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం): ప్రొద్దుటూరు టూ టౌన్ పరిధిలో దాదాపు ఏడు సంవత్సరాల క్రితం హైందవి (21) అనే యువతి దారుణ హత్య కేసులో ముద్దాయి నవీన్ కుమార్ కు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.1 లక్ష 50 వేలు జరిమానా విధిస్తూ ప్రొద్దుటూరు సెకండ్ ఏ.డి.జె కోర్టు జడ్జి శ్రీ జి.ఎస్ రమేష్ కుమార్ సోమవారం తీర్పు ఇచ్చారని టూ టౌన్ సిఐ అబ్దుల్ కరీం తెలిపారు. స్థానిక గోకుల్ నగర్ కు చెందిన కడపన జయప్రకాశ్ రెడ్డి కుమార్తె కడపన హైందవిని ముద్దాయి నవీన్ కుమార్ అదనుగా భావించి హైందవి బలవంతం చేయబోగా, హైందవి ప్రతిఘటించడంతో ముద్దాయి నవీన్ కుమార్ భయపడి అక్కడ ఉన్న కత్తి తీసుకొని హైందవి గొంతులో పొడిచి రక్త గాయం కలిగేసినట్టు హైందవి సదరు రక్తదాయంతో చనిపోయిందని వివరించారు. ముద్దాయి నవీన్ కుమార్ హైందవి మెడలోని బంగారు గొలుసు, చెవులకు ఉన్న జూమ్కీ కమ్మలు, సెల్ ఫోను, స్కూటీని తీసుకొని, స్కూటీని పెట్రోలు బంకు వద్ద వదలి పారిపోయాడని, ఈ కేసులో ముద్దాయి ని అరెస్టు చేసి ఛార్జ్ షీట్ దాఖలు చేయగా, ప్రొద్దుటూరు 2వ ఏడిజే కోర్టు నందు విచారణ జరిగి, సోమవారం ముద్దాయికి యవజీవ కారాగార శిక్ష మరియు 1 లక్ష 50 వేలు జరిమానా విధించారు. ఫైన్ కట్టలేని పక్షంలో అదనంగా 6 సంవత్సరాల 9 నెలలు జైలు శిక్ష విధించారని వివరించారు.

## మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిస్తే తిరుమలకు వచ్చి మొక్కుబడే తీర్చుకుంటాం

లక్కిరెడ్డిపల్లె సూర్య వాస్తవం న్యూస్:రాయచోటి నియోజకవర్గంలో నుంచి మందిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిస్తే తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామికి పాదయాత్రతో వచ్చి ముక్కుబడి తీర్చుకుంటామని దీన్నేపాడు, వడ్డేపల్లి గ్రామస్తులు తెలిపారు. సోమవారం దిన్నెపాడు ,వడ్డేపల్లి గ్రామస్తులు శివానంద ఆధ్వర్యంలో తిరుమలకు పాదయాత్ర కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలవడమే కాకుండా మంత్రి పదవి స్వీకరించారని అందుకు తమ ముక్కుబడులు తీర్చేందుకు ఒక్కొక్కరు 101 కొబ్బరికాయ సమర్పించి మొక్కుబడులు తీర్చుకుంటామని వారు తెలిపారు. దీన్నేపాడు వడ్డేపల్లి నుంచి పాదయాత్ర ప్రారంభించి లక్కిరెడ్డిపల్లి చేరుగాగానే టిడిపి రాజంపేట పార్లమెంటు డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీ నాయక్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరయ్య, ఆంజనేయులు, రామాంజ నేయులు, వెంకటప్ప, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రకు తరలి వెళ్లారు.



## ప్రొద్దుటూరులో యువకుని హత్య

ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం): పట్టణంలో సోమవారం ద్వార్శల వెంకట మహేశ్వరరెడ్డి(25) అనే యువకుని హత్య ఘటన చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు ... పట్టణంలోని వైఎంఆర్ కాలనీలో ఓ మాజీ ఎమ్మెల్యే ఇంటి ఎదురుగా నివాసం ఉంటున్న ద్వార్శల వెంకట మహేశ్వర రెడ్డి అనే యువకుడు హత్యకు గురయ్యారని, ఇతను భారతీ సిమెంట్ ఫ్యాక్టరీ లో పని చేస్తున్నాడని, ఇతడిని హత్య చేసిన వ్యక్తి భూమిరెడ్డి రామచంద్రారెడ్డి అని నిర్ధారించినట్లు తెలిపారు. కాగా ఇక్కడ విశేషమేమంటే సంఘటనా స్థలంలో మృత దేహం కనిపించలేదు. ఇల్లంతా రక్తపు మరకలు, శరీర భాగాలు ఉన్నాయని, నిందితుడే మృత దేహాన్ని తీసుకొని వెళ్ళి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కాగా మృతుని తల్లి ద్వార్శల సుబ్బరత్నమ్మ తన కుమారుని చంపింది రామచంద్రారెడ్డి అని చెబుతున్నారని, 20 ఏళు ్లగా రామచంద్రారెడ్డి,సుబ్బరత్నమ్మలు వైఎంఆర్ కాలనీలో ఓకే ఇంటిలో సహజీవనం చేస్తున్నారని, అయితే సుబ్బరత్నమ్మ వద్ద డబ్బు, ఆస్తి ఎక్కువగా ఉందని,ఈ ఆస్తి ఆమె కుమారుడికి దక్కుతుందని భావించి ఆ యువకుడిని అడ్డు తొలగించుకోవడానికి ఈ హత్య జరిగి ఉండవచ్చు అని భావిస్తున్నామన్నారు. అంతేకాకుండా రామచంద్రా రెడ్డి, సుబ్బరత్నమ్మ వ్యాపారం చేస్తుంటారని అందులో కూడా వారిద్దరూ గొడవ పడేవారని తెలుస్తోంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతి చెందిన వెంకట మహేశ్వర రెడ్డి (ఫైల్ ఫోటో)



నిందితుడు రామచంద్రారెడ్డి (ఫైల్ ఫోటో)

## భూ తగాదాలతో కోళ్ల ఫారాలకు నిప్పు..సుమారు మూడు లక్షలు ఆస్తి నష్టం



ఐరాల సూర్య వాస్తవం: ఐరాల మండలం,మోటకంపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు రైతుల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో, మోటకం పల్లికి చెందిన రిటైర్డ్ ఏఎస్ఐ రసూల్ సాహెబ్ వారి కుటుంబ సభ్యులకు,మోటకంపల్లికి చెందిన మధురెడ్డికి గత నాలుగు సంవత్సరాలుగా భూ తగాదాలు నడుస్తుంది. ఈ నేపథ్యంలో రసూల్ సాహెబ్ కు ఆర్డీవో కోర్టులోను, డిస్టిక్ కోర్టులను అనుకూలంగా వచ్చిన అవతలి వ్యక్తి మధు రెడ్డి కోర్టు ఆదేశాలను దిక్కరిస్తూ ఆదివారం ఆ భూమిలో ట్రాక్టర్ తో దున్ని అడ్డు వస్తే రసూల్ సాహెబ్ కుటుంబాన్ని ట్రాక్టర్ తో తొక్కి చంపించేస్తానని వారిని భయభ్రాంతులకు గురి చేశారు. తర్వాత ఆదివారం రాత్రి సమయంలో మధు రెడ్డి అనుచరులతో కోళ్ల ఫామ్ దగ్గర పెట్రోల్ తో దగ్ధం చేయాలని ప్రయత్నించాడు. కోళ్ల ఫారం దగ్గర ఉన్న సిసి ఫుటేజ్ ద్వారా కొంతమందిని గుర్తించామని వారిపై కూడా ఐరాల పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ చేయడం జరిగిందని రసూల్ సాహెబ్ తెలిపారు. ఆ దాడిని గుర్తించి వెంటనే ఫైర్ 101 కు కాల్ చేసి వారు చేసిన దాడిని ఆపటానికి ప్రయత్నించారు.కానీ ఆ సమయానికి సుమారు100 కోళ్లు మెటీరియల్ కాలిపోవడంతో తనకు జరిగిన అన్యాయంపై పోలీస్ కంప్లైంట్ ఇవ్వడం జరిగింది.వీరికి జరిగిన అన్యాయంపై ఖండిస్తూ బీఎస్పీ పార్టీ జిల్లా ఇంచార్జి నాగేశ్వరరావు, పూతలపట్టు నియోజకవర్గం నాయకులు పై విషయాలను ఖండిస్తూ వెంటనే న్యాయం జరగాలని లేకుంటే రాష్ట్రస్థాయిలో ధర్నా చేస్తాంఅని తెలిపారు. పై విషయంలో సంబంధించిన పోలీస్ స్టేషన్లోనూ, జిల్లా ఎస్పీకి, కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని తెలియచేశారు.తనకు జరిగిన మూడు లక్షల నష్టాన్ని దాడి చేసిన మధు రెడ్డి ద్వారా తనకు ఇప్పించాలని రసూల్ సాహెబ్ కుటుంబ సభ్యులు కోరడం జరిగింది.

## చిత్తూరు జిల్లా నూతన కలెక్టర్‌గా సుమిత్ కుమార్ బాధ్యతల స్వీకారం

### - ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ స్పష్టీకరణ

చిత్తూరు, సూర్య వాస్తవం: చిత్తూరు జిల్లా నూతన కలెక్టర్‌గా సుమిత్ కుమార్ సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వేద మంత్రోచ్ఛారణల మధ్య వేద పండితులు ఆయనను ఆశీర్వదించారు. కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన సుమిత్ కుమార్ కు జిల్లాలోని పలువురు అధికారులు, రాజకీయ నేతలు, ఆయనను కలిసి అభినందనలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ సుమిత్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ గతంలో తాను వైయస్సార్ కడప, తూర్పుగోదావరి జిల్లాలలో కలెక్టర్‌గా పనిచేశానని తెలిపారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాకు కలెక్టర్‌గా బదిలీ పై వచ్చానన్నారు. చిత్తూరు జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ పథకాల అమలుకు అధిక ప్రాధాన్యతనిస్తానని ఆయన ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు.





## బాల కార్మిక పిల్లలును పాఠశాలలో చేర్పించిన గ్లోబల్ సర్వీస్ ట్రస్టు

రైల్వే కోడూరు (సూర్య వాస్తవం)రైల్వే కోడూరు పట్టణంలో గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్షరజ్యోతి కార్యక్రమంలో భాగంగా బడికి వెళ్ళని పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పిస్తున్నామని ట్రస్ట్ చైర్మన్ కె. పార్థసారధి తెలిపారు. సోమవారం రైల్వే కోడూరులోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ పలిగల చిన్నిని మండల పరి షత్ పాఠశాలలో చేర్పించారు. ఇంకా పేద విద్యార్థులను కొంత మందిని గుర్తించామని, మరి కొందరు ఆధార్ కార్డు లేని వారు కూడా చాలా మంది ఉన్నారని, వారిని కూడా పాఠశాలలో చేర్పిస్తున్నామని తెలిపారు.



# స్వప్నం నెరవేరిన వేళ...సహకరించిన కర్నూల్ నేల

– ఎంపీగా బస్తిపాటి నాగరాజు ప్రమాణ స్వీకారం



**అనంతపురం క్రైం ( సూర్య వాస్తవం) :** తెలుగుదేశం పార్టీ తరపున కర్నూలు ఎంపీగా బస్తిపాటి నాగరాజు పార్లమెంట్లో సోమవారం నాడు ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన తెలుగులోనే ప్రమాణ స్వీకారం చేసి అందర్నీ ఆకట్టుకున్నారు. నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ సహకారంతో కర్నూల్ పార్లమెంట్ ప్రజల ఆశీర్వాదంతో పార్లమెంట్ భవనంలో తొలి అడుగు వేసి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా తన విజయంలో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. అనుక్షణం కర్నూల్ పార్లమెంట్ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సేవలో ఉండి సేవకుడిలా పనిచేస్తాను అని తెలియజేశారు

# రేషన్ కార్డుదారులకు తీపి కబురు...

**అనంతపురం టౌన్ (సూర్య వాస్తవం):** రేషన్ కార్డులు ఉన్న వారికి జులై నుంచి రాగులు పంపిణీ చేస్తామని పౌరసరఫరాల శాఖ తెలిపింది. ప్రస్తుతం రాయలసీమలోని 8 జిల్లాల్లో వీటిని పంపిణీ చేస్తుండగా, మిగతా జిల్లాలకు విస్తరించనుంది. 3 కే.జి ల బియ్యానికి బదులుగా రాగులు పంపిణీ చేస్తారు. అటు జులై నుంచి శ్రీ సత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రేషన్ కార్డుదారులకు జొన్నలు పంపిణీ చేయనున్నారు. రాగులు, జొన్నలు ఇష్టం లేని వారు పూర్తిగా బియ్యం పొందవచ్చు.

# ఈనెల 29 న లోకదాలత్ ను సద్వినియోగం చేసుకోండి

**లక్కిరెడ్డిపల్లె సూర్యవాస్తవం :** ఈనెల 29వ తేదీన జాతీయ లోకదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లె సివిల్ కోర్టు జడ్జి షేక్ పై జున్నీసా తెలిపారు. సోమవారం స్థానిక సివిల్ కోర్టులో సమావేశం నిర్వహించారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ గంగనాథ్ బాబు, ఎస్ఐ విష్ణువర్ధన్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# గృహ హింసను తరిమికొడదాం

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం టౌన్ (సూర్య వాస్తవం):** గృహ హింసను తరిమికొడదామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో జిల్లా మహిళాభివృద్ధి/ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గృహ హింసకు వ్యతిరేకంగా రూపొందించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఐదుగురు మహిళల్లో కనీసం ఒకరు జీవితంలో ఎప్పుడైనా ఒకసారి గృహ హింసను ఎదుర్కొని ఉంటారని, మన సమాజంలో మహిళలకు ఆత్మగౌరవం, రక్షణ కావాలన్నారు. గృహహింస బాధితులు సహాయం కోసం మహిళా శిశు సంక్షేమ శాఖలోని గృహహింస విభాగాన్ని ఉమెన్ హెల్ప్ లైన్ 181కు సంప్రదించాలన్నారు. గృహహింస నుండి ప్రతి ఒక్కరికి విముక్తి కల్పించాలని, ఇందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, ఐసిడిఎస్ పిడి బి.ఎన్.శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

# రామకుప్పం పూల వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో సన్మానం

**రామకుప్పం సూర్యవాస్తవం:** చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి నాలుగవసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా స్థానిక అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం లో టెంకాయలు కొట్టి చంద్రబాబు నాయుడు కుటుంబం పేరుమీద అర్చన అభిషేక కార్యక్రమాలు నిర్వహించిన స్థానిక తెలుగుదేశం, బిజెపి, జనసేన, నేతలను రామకుప్పం పూల వ్యాపారుల సంఘం ఘనంగా సన్మానించారు.



# జర్నలిస్టుల పిల్లలకు 60శాతం ఫీజు రాయితీ ఇవ్వాలి



**పత్తికొండ సూర్యవాస్తవం :** పత్తికొండ నియోజకవర్గంలో వున్న ప్రవేట్ కార్పొరేట్ పాఠశాలలో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు 60 % శాతం ఫీజు రాయితీ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) పత్తికొండ నియోజకవర్గ అధ్యక్షుడు బి.ఎం.సాల్ రంగడు గౌరవ అధ్యక్షులు ఎం.రంగన్న,సహాయకార్యదర్శి హనుమంతు,సీనియర్ జర్నలిస్టు చిన్న గిడ్డయ్య,లు కోరారు.సోమవారం స్థానిక మండల విద్యాధికారి రమేష్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా బి.ఎం.సాల్ రంగడు మాట్లాడుతూ కర్నూలు జిల్లా వ్యాప్తంగా గత కొన్ని ఏళ్లుగా జర్నలిస్టుల పిల్లలకు 60 శాతం ఫీజు రాయితీ ఇస్తున్నారు.ఈ ఏడాది కూడా ప్రవేట్ కార్పొరేట్ పాఠశాలలో ఫీజు రాయితీ ఇవ్వాలని కోరారు.ప్రవేట్ కార్పొరేట్ పాఠశాల యాజమాన్యాలు,జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.మండల విద్యాధికారి స్పందించి జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి ప్రవేట్ కార్పొరేట్ పాఠశాల యాజమాన్యాలుతో సమావేశం ఏర్పాటు చేసి వారిని ఒప్పిస్తామన్నారు.ఈకార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు తాజ్ మహమ్మద్.గోపాల్ కృష్ణ,జాఫర్.గోపాలకృష్ణ. శ్రీనివాసులు, నాగేశ్వరరావు,అరిఫ్,శివ.తదితరులు పాల్గొన్నారు.

# మూడు రోజుల పాటు అమ్మవారిశాలలో ప్రవచనాలు



**ప్రొద్దుటూరు, (సూర్యవాస్తవం):** స్థానికమెయిన్‌బజార్‌లోని అమ్మవారి శాలలో మూడు రోజుల పాటు ప్రవచనాల ప్రసంగం జరుగుతుందని ఆర్య వైశ్య సభ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బుశెట్టి రామ్మోహన్ రావు, మురికి నాగేశ్వరరావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జూన్ 28,29,30వ తేదీలలో అనగా శుక్ర, శని, ఆదివారాలలో ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రిచే భాగవతాంతర్గత ప్రహ్లాద చరితము, నృసింహ అవతార ఘట్టము మరియు నవవిధ భక్తి మార్గములు – ఉపాసన అనే అంశములపై విశేష ప్రవచనములు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరిదేవి అమ్మవారిశాల నందు జరుగుతుందని వివరించారు.

# ప్రవీణ్ అనే వ్యక్తి ప్రజల పక్షాన ఉంటాడు




**ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం):** ప్రవీణ్ అనే వ్యక్తి ప్రజల పక్షాన ఉంటాడని ప్రొద్దుటూరు టిడిపి ఇన్చార్జ్ డాక్టర్ జివీ ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక టిబి రోడ్డులోని ప్రవీణ్ కుమార్ రెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్ మోహన్ రెడ్డి అధికారం కోల్పోయాక కడప జిల్లాకు వచ్చి సమావేశాలు పెట్టడం చూస్తుంటే విడ్డూరంగా వుందన్నారు. సీఎంగా ఉన్నప్పుడు జిల్లాలో ఏ అభివృద్ధి విషయాల్లో పట్టించుకోని వ్యక్తి ఓడిపోయాక వచ్చారన్నారు. జిల్లా వాసి సీఎం అయివుండి, ఉమ్మడి కడప జిల్లాలో 10కి 10 ఎమ్మెల్యే, 2 ఎంపీ స్థానాలు గెలిచినా కూడా కడపకుస్టీల్‌ప్లాంట్ తేలేకపోయాడని, పాలకేంద్రం, చెన్నూరు చెక్కర ఫ్యాక్టరీ, చిన్న పరిశ్రమను కూడా జగన్మోహన్ రెడ్డి జిల్లాలో తీసుకురాలేకపోయారని విమర్శించారు. పైగా ప్రస్తుతం ప్రజలను మభ్యపెట్టేందుకే ఓదార్పు యాత్ర చేస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పదికి పది ఎమ్మెల్యే స్థానాలు వచ్చినప్పుడే జిల్లాకు ఏమీ చేయలేని జగన్మోహన్ రెడ్డి , ఇప్పుడు ఏదో చేస్తామంటే ఎవరు నమ్ముతారు అన్నారు. కొడాలి నాని లాంటి వారిని వెంటబెట్టుకొని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, నారా లోకేష్‌ను తిట్టించడమే పనిగా పెట్టుకు న్నారన్నారు. కనీసం ప్రతిపక్ష నేతగా కూడా ప్రజలు జగన్మోహన్ రెడ్డికి అవకాశం కల్పించలేదంటే ఎంత దారుణమైన పరిస్థితుల్లో వైసిపి ప్రభుత్వం పని చేసిందో అర్థమవుతుందన్నారు. ప్రొద్దుటూరు నియోజక వర్గంలో మాజీ శాసనసభ్యులు కాబోతున్న రాజమల్లు శివ ప్రసాద్ రెడ్డి అని తాను ఎన్నోసార్లు చెప్పానని, టిడిపి వారిపై ఎన్నో కేసులు పెట్టారని, తమ కుటుంబాలను వేదించారన్నారు. ఆనాడు విమర్శించిన వారు ఎక్కడున్నారో తెలి యడం లేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా తాను ప్రజల పక్షాన ఉండి ప్రజల కోసం పనిచేశానని, కానీ ప్రొద్దుటూరు ఎమ్మెల్యేగా పనిచేసిన రాచమల్లు శివప్రసాదరెడ్డి మాత్రం సంవత్సరం రోజుల పాటు ప్రశ్నించనని చెప్పడం బాధాకరమన్నారు. ప్రజలకు సమస్య వస్తే ప్రతిపక్షంగా ఉండి ప్రశ్నించాలని సూచించారు. ప్రొద్దుటూరు నియోజవర్గంలో అధికారులకు, పోలీస్ అధికారులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని, వారి అందరి పేర్లు లోకేష్ బుక్కులో ఎంటర్ చేయిస్తానని చెప్పారు. ఏ వ్యక్తి కోసమోపనిచేస్తేజరగబోయేదానికి తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. చంద్రబాబు నాయుడుకు, లోకేష్‌బాబుకుచెడ్డపేరు వచ్చే పని చేయవద్దన్నారు. ప్రజల కోసం ప్రజల పక్షాన పని చేయాలని ఇసుక, మట్కా, క్రికెట్ బుకీలకి పోలీసుల సహకారం ఉందని తెలిసిన నేరుగా చంద్రబాబు నాయుడుదృష్టికి, లోకేష్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. తెలుగుదేశంపార్టీకిముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు లోకేష్ బాబుకి మంచి పేరు వచ్చేలా చూడాలన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలే కాదని పొద్దుటూరు ప్రజలకు ఏ ఇబ్బంది వచ్చినా నేరుగా తనకే వచ్చి చెప్పి పరిష్కరిస్తానని లోకేష్ బాబు చెప్పారని ప్రవీణ్ అనే వ్యక్తి ప్రజల పక్షాన ఉంటాడన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో ఎంపీలను మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి మైనారిటీ నాయకులు





**అనంతపురం క్రైమ్ (సూర్యవాస్తవం) :** తెలుగుదేశంపార్టీ ఎంపీలను ఢిల్లీలోని మాజీఎంపీగల్లా జయదేవ్ నివాసంలో కేంద్ర విమానయాన మంత్రికిం జరపురామ్మోహన్ నాయు డు,హిందూపురం ఎంపీ బికే పార్థ సారథి, అనంతపురంఎంపీఅంబిక లక్ష్మీనారాయణ,పెమ్మసానిచంద్ర శేఖర్, అప్పల నాయుడు, కేసీనేని చిన్ని, బైరెడ్డి శబరి,హరిబాలయోగిలను అనంతపురం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మైనార్టీ నాయకులు సాలార్ బాషా, ఐ.ఏం.ఏం మహబూబ్ బాషామర్యాద పూర్వకంగా కలిశారు.పార్లమెంట్లో ప్రమాణస్వీకారానికివెళ్తున్నసందర్భంలో వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా టీబీ టీకాల కార్యక్రమం



**పోరుమామిళ్ల సూర్యవాస్తవం :** పోరుమామిళ్ల మండలంలోని అన్ని విలేజ్‌హెల్త్‌క్లినిక్‌యందు వయో జనులకు క్షయటీకాల కార్యక్రమం జరుగుతుంది. టి.బి.(క్షయ)ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా 18ఏళ్లు దాటిన ప్రత్యేక వారిని గుర్తించివారికి మధుమేహ వ్యాధిగ్ర స్తులకి, ధూమపానం చేయువారికి, టీబి మందులువాడి తగ్గిన వారికి, టిబి వ్యాధి కుటుంబ సభ్యులకి, 60 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరికి బాడి మాస్ ఇండెక్స్ 18లోపు ఉన్నవారికి బీసీజి టీకాను ఉచితంగా వేయినున్నట్లు మండల వైద్యాధికారి మేరీ ఎలీసా,డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ కరిష్మా తెలిపారు,ప్రతి హెల్త్ అండ్‌వెల్నెస్ సెంటర్లో ఆరోగ్య సిబ్బంది వ్యాక్సిన్ అందుబాటులో ఉంచుకొని, ప్రతి సోమ వారం గురువారం ప్రత్యేకంగా పెద్దలకి బీసీజీ వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని వైద్య ఆరోగ్య విద్య అధికారి సాదు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు

# ఫిర్యాదులపై తక్షణమే స్పందించండి

### అదనపు ఎస్పీ విష్ణు



**అనంతపురం (సూర్యవాస్తవం) :** ఫిర్యాదుల పట్ల తక్షణమే స్పందించి పరిష్కారానికి సంబంధించిన పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ విష్ణు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసుకార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అదనపు ఎస్పీ విష్ణు'ప్రజా ఫిర్యాదుల పరిష్కార' వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఫిర్యాదులు స్వీకరించి బాధితులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.వివిధసమస్యలపై21ఫిర్యాదులనుస్వీకరించారు. ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

# ఏపీజీఈఏ పత్తికొండ తాలుకా నూతన కార్యవర్గం ఎన్నిక

**పత్తికొండ (సూర్యవాస్తవం) :** ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తరుపున పత్తికొండ తాలుకా యూనిట్‌కు నూతన కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. సభ్యులందరు ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్టు ఎన్నికల అధికారి కర్నూలు జిల్లా జాయింట్ సెక్రటరీ ఎం. ఆంజనేయులు నాయక్ తేలి పారు. పత్తికొండ తాలుకా నూతన కార్యవర్గం షేక్ రియాజ్ భాష ఆధ్వర్యంలో కొలువుదీరింది. కార్యదర్శిగా టి.భరత్ ,కోశాధికారిగా డి.జిలానీ భాష, ఆర్గనైజింగ్ సెక్రటరిగా యం. డి.దివాకర్, అసోసియేట్ ప్రెసిడెంట్ డి.వెంకటేష్, ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి ఆంజనేయులు నాయక్ తెలిపారు. పత్తికొండ తాలుకా పరిధిలోని ఉద్యోగుల హక్కులు సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు షేక్.రియాజ్ భాష తెలియజేశారు.



# నారాయణ విద్యాసంస్థలను సీజ్ చెయ్యాలి...ఏఐఎస్ఎఫ్




**అనంతపురం క్రైం సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా వ్యాప్తంగా నారాయణ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్ముతున్న నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నాడు నారాయణ జూనియర్ కళాశాల ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షులు ఓబులేష్ ఏఐఎస్బి జిల్లా ప్రధాన కార్యదర్శి పృద్వి బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ యాదవ్ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్య క్షులు రమణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ నిబం ధనలు తుంగలో తొక్కుతూ విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలను ఫస్ట్ ఇయర్ సెకండ్ ఇయర్‌కు పదివేల నుంచి 15వేల రూపాయల వరకుఅమ్ముతున్నారని తెలిపారు. దీనిపైన జిల్లాలో ఉన్న ఆర్ఐఓకి అనేకసార్లు వినతి పత్రాల ద్వారా ఆందోళన కార్యక్రమాల ద్వారా ఆధారాలతో సహా అందజేశా కనీసం నారాయణ విద్యాసంస్థల పైన కానీ అనంతపురం నగరంలో ఉన్న కార్పొరేట్ విద్యాసంస్థలపై అయినా కానీ విజిట్ చేయకుండా ఎంక్వయిరీ చేయకుండా కార్పొరేట్ విద్యాసంస్థల పైకి కన్నెత్తి కూడా చూడకుండా ఆర్ఐఓ ఉంటున్నారనిమండిపడ్డారు. నారాయణ విద్యా సంస్థలకు వత్తాసుగా పనిచేస్తున్న ఆర్ఐవోను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పుస్తకాలు అమ్ముతున్నారని కాల్ చేసినా కూడా కనీసం విద్యార్థి సంఘాల నాయకుల ఫోన్లు లిఫ్ట్ చేయకుండా ఉంటున్నారని తెలిపారు. నారాయణ విద్యాసంస్థల పైన జిల్లా ఆర్ఐఓ గారికి ఎందుకు అంత ప్రేమని ప్రశ్నించారు. అదేవిధంగా ప్రభు త్వం నిర్ణయించిన గ్రూపులు కాకుండా ఎంపీసీ బైపీసీలో ఎంసెట్ జెడ్ ఎఫ్‌టిబిఐసి కోస్పార్క్ సూపర్‌చైనా అంటూ రకరకాల గ్రూపులు ఏర్పాటు చేసుకొనిఒకగ్రూపుకుఒక్కొక్క ఫీజు నిర్ణయించుకొని విద్యార్థుల తల్లిదండ్రుల నుండి డబ్బులను జలగల్లాగా పీల్చుకో తింటు న్నారని మండిపడ్డారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు పట్టికను జిల్లాలో ఏ విద్యాసంస్థలలోనూ అమలు చేయలేదని మండి పడ్డారు..తక్షణమే రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు స్పందించి కార్పొరేట్ విద్యాసంస్థలకు వత్తాసుగా పనిచేస్తున్న ఆర్ఐవో వెంకటరమణ నాయక్ ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు విద్యా సంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్ముతున్న నారాయణ విద్యాసంస్థల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు శ్రీకారం చుడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మంజునాథ్ వంశీ ఆనంద్ పవన్ హర్ష కార్తీక్ ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్దు గిరి సూర్య శివ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

# నిర్భయంగా సమస్యలు తెలియజేయండి

### పరిష్కారం చూపిస్తాం – జిల్లా ఎస్పీ గౌతమిసాలి



**అనంతపురం క్రైం ( సూర్య వాస్తవం) :** స్వేచ్ఛగా, నిర్భయంగా సమస్యలు తెలియజేయాలని వాటికి చట్టపరిధిలో పరిష్కారం చూపుతామని జిల్లా ఎస్పీ గౌతమిసాలి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యలను శ్రీఘ్రంగా, నాణ్యతగా పరిష్కారం చూపాలనే రాష్ట్ర ప్రభుత్వం సంకల్పం మేరకు జిల్లా ఎస్పీ సోమ వారం నాడు స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలమూలల నుండీ వచ్చిన ప్రజల నుండీ ఎస్పీ 79 ఫిర్యాదులు స్వీకరించారు.పిటీషనర్లతోముఖాముఖి మాట్లాడారు.లోతుగా వారి సమస్యలను విని అక్కడికక్కడే సంబంధితపోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలుజారీచేశారు.ప్రజాఫిర్యాదుల పరిష్కారానికిప్రాధాన్యతఇవ్వాలనిసూచించారు. భార్యా భర్తలగొడవలుకుటుంబసమస్యలు,రస్తా వివాదాలు, తదితరఅంశాలపైఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్ విజయభాస్కర్ రెడ్డి, ఎస్బీ సి.ఐ ఇందిర, తదితరులు పాల్గొన్నారు.



# బ్లాక్ ఫౌండేషన్ భూములు దళితులకు ఇప్పించండి

### భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య



**రైల్వే కోడూరు (సూర్యవాస్తవం) :** భారత కమ్యూ నిస్టు పార్టీ సిపిఐ మండల కార్యదర్శి గానుగుపెంట ఆదినారాయణ ఆధ్వర్యంలో సోమవారం రాజం పేట ఆర్డీవో టీ మోహన్ రావుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతి చిన్నయ్య మాట్లాడుతూ పెనగలూరు మండలం రెవెన్యూ వారు గతంలో బ్లాక్ ఫౌండేషన్‌గా నిరూపించి నటువంటి భూములను అగ్ర వర్ణాలకు చెందినటు వంటి వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు సిద్దవరం పంచా యతీలో ఉన్నటు వంటి లేబాక శ్రీనివాస్ రెడ్డి సిద్దవరం పంచా యతీలో బ్లాక్ ఫౌండేషన్ భూములను రాత్రికి రాత్రే మామిడి చెట్ల నాటి దళితులు కడుపులు కొడుతున్నారని అన్నారు. సదరు భూమిని గతంలో ఉన్నటువంటి తహశీల్దార్ తిరుమల రాజుపేట దళితులకే ఇస్తామని హామీ ఇచ్చారు. తర్వాత వచ్చిన మండల తాసిల్దార్ శ్రీధర్ రావువైఎస్ఆర్సిపి రాజకీయ నాయకులకు తొత్తుగా మారి వాళ్ళు ఇచ్చే ముడుపుల కోసం దళితుల కడుపులు కొటడం జరిగిందని అన్నారు. రైల్వే కోడూరు దళితుల నియోజకవర్గంలో మూడుసార్లు గెలిచిన శాసన సభ్యులు కొరముట్ల శ్రీనివాసులు దళితులకు న్యాయంచేయకుండా అగ్రవర్ణాల వారికి తొత్తుగా మారి వాళ్లకి సదరు భూమిని కట్టబెట్టాలని అనుకోవడం పద్ధతి కాదని అన్నారు. గతంలో ఉన్న తాసిల్దార్ శ్రీధర్ రావు కబ్జాదారులుదగ్గర ముడుపులు తీసుకున్నటు వంటి తాసిల్దారు శ్రీధర్ రావుని వెంటనే ఇప్పుడు ఉన్న ఆర్టీవో టి మోహన్ రావు స్పందించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోయి వెంటనే తహసిల్దార్ శ్రీధర్ రావును సస్పెండ్‌చేసి. దళితుల భూమిని సబ్జా చేసినటువంటి లేపాకు శ్రీనివాస్ రెడ్డి తండ్రి రామచంద్ర రెడ్డి అనే భూకబ్జాదారుడుపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకొని సదరు బ్లాక్ ఫౌండేషన్ గల భూమిని దళితులకే ఇచ్చి న్యాయం చేయాలని అన్నారు. అప్పుడు ఉన్నటువంటి తహశీల్దార్ శ్రీధర్ రావు పెనగలూరు మండలంలో డీకేటీ భూములు,ఏటి పరంబోకు భూములు, చెరువు పరం బోకు భూములు, గుట్టలు, వాగులు, కొండలు, వంకలు, గల భూములు అన్నిటిని కూడా వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అండతో భూకబ్జాదా రులకు కట్ట బెట్టారని అన్నారు. ఇప్పుడు మళ్లీ సిద్దవరం పంచాయతీ రెవెన్యూ సర్వేనెంబర్ 407/1లో విస్తీర్ణం 7 ఎకరాలు బ్లాక్ ఫౌండేషన్ భూమిని కూడా కబ్జా చేసేందుకు శ్రీనివాస్ రెడ్డి చూస్తున్నారని అన్నారు. ఇప్పటికైనారెవెన్యూ యంత్రాంగందళితులను చిన్న చూపు చూడకుండా వాళ్లను గమనించి అక్కడే ఉన్నటువంటితిరుమలరాజుపేట దళితులకు సదరు భూమిని వారికే ఇవ్వాలనిఅన్నారు.లేని పక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీసిపిఐ ఆధ్వర్యంలో రాజంపేటఆర్డీవో కార్యాల యం దగ్గర ఆందోళన కార్యక్రమంచేపడతామనితెలియజేసు కుంటున్నాము.ఈ కార్యక్రమానికి సిపిఐ మండల సహాయ కార్యదర్శులుఈరిలక్ష్మీనారాయణ,బిదం రాజశేఖర్, మండలకార్యవర్గసభ్యులుఈరి భాస్కర్ , వ్యవసాయ కార్మికసంఘంరైల్వేకోడూరునియోజకవర్గ అధ్యక్షులు రేవూరి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## కట్టా బాలాజీని పరామర్శించిన ముక్కా వరలక్ష్మి



**రైల్వే కోడూరు (సూర్య వాస్తవం) :** రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కట్టా బాలాజీ నాయుడుని తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ముక్క రూపానంద రెడ్డి సతీమణి వరలక్ష్మి ఆమె కుమారులు ముక్కా విశాల్ రెడ్డి, ముక్కా సాయి వికాస్ రెడ్డిలు ఆరోగ్య విషయాలను అడిగి పరామర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల కాలంలో కట్టా బాలాజీ అనారోగ్య హాస్పిటల్ నందు చికిత్స పొంది ఇంటికి వచ్చిన నేపథ్యంలో సమాచారం అందుకున్న ముక్కా వరలక్ష్మి వెంటనే రైల్వేకోడూరులోని ఆర్ఎస్ రోడ్‌లో ఉన్న బాలాజీ స్వగృహంనకువెళ్లి పరామర్శించారు. ఈసందర్భంగాగత ఎన్నికలలో కూటమి జనసేన అభ్యర్థి విజయానికి కృషి చేశారని త్వరగా ఆయన కోలుకోవాలని మనస్ఫూర్తిగా దేవుడిని ప్రార్థిస్తున్నట్లు ముక్కా వరలక్ష్మి తెలియజేశారు.

## సిని హీరో సుమన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జాప్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు..



**అనంతపురం క్రైం (సూర్యవాస్తవం) :** సినీ హీరో సుమన్‌ను వ్యాపార సముదాయాన్ని ప్రారంభించడానికి వచ్చిన సందర్భంగా సోమవారం నాడు పత్తికొండలో సీనియర్ జర్నలిస్ట్, ఉమ్మడి కర్నూల్ జిల్లా జాప్ యూనియన్ ప్రెసిడెంట్ తుగ్గలి సూర్య గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారు పలు విషయాలపై చర్చించారు

## ప్రజా సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి

**లక్కిరెడ్డిపల్లె సూర్యవాస్తవం :** ప్రజా సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎంపీడీవో సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారిగా అధికారులు మాట్లాడారు. ముందుగా అనంతపురం ఈడిగ పల్లె, వడ్డేపల్లి, మద్దిరేవుల గొల్లపల్లి గ్రామానికి విద్యుత్తు సమస్య ఉందని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోలేదని ప్రజలు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రామాపురం, లక్కిరెడ్డిపల్లె రోడ్డు మార్గాలు ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరగా స్పందించిన ఆర్టీసీ అధికారులు రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. ఖరీఫ్ సీజన్లకు ప్రభుత్వం అందించిన సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలు ఎరువులు సక్రమంగా రైతులకు అందించాలని సర్పంచ్లు వ్యవసాయ అధికారులను కోరారు. మామిడి సీజన్ పూర్తయిందని ప్రభుత్వం ఇస్తున్న మామిడి చెట్టుకు ప్రభుత్వం అందిస్తున్న ఎరువులు, కత్తెరలు, రంపాలు అందించాలని వారిని కోరారు. సీజనల్ వ్యాధులు పట్ల వైద్య అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అంబాపత్తి రమాదేవి అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్తులు, వక్ఫ్ బోర్డు, దేవదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలి



**ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం):** ప్రభుత్వ ఆస్తులు, వక్ఫ్ బోర్డు, దేవదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని మైనారిటీ నాయకులు షేక్ మాబుషరీఫ్ కోరారు. సోమవారం వారు ఈ విషయమై ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులు అయిన చెరువులు, కుంటలు, వాగులు వంకలు, కాలువలు, రోడ్లు మరియు వక్ఫ్ బోర్డు దేవదాయ భూములను ఆక్రమణదారుల నుండి పరిరక్షించాలన్నారు. ప్రభుత్వ ఆస్తులు దేవాదాయ వక్ఫ్ బోర్డ్ ఆస్తులను పరిరక్షించాలని భవిష్యత్తు కాలంలో వీటి ఆక్రమణలు జరగకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రహరీ గోడలు నిర్మించి సంబంధిత అధికారులతో చర్చించి ఈ సమస్యలను పరిష్కరించాలన్నారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ముందుగా గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలి గ్రామపంచాయతీ నిధులు సక్రమమైన మార్గంలో పంచాయతీ నిధులు పంచాయతీ అభివృద్ధికి కేటాయించేటప్పుడు చూడాలని పంచాయతీ నిధులు దుర్వినియోగం కాకుండా కాపాడాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి శాఖా పరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాలిక్, పాలాజి శేఖర్, రమణ, ప్రొద్దుటూరు నియోజవర్గ అభివృద్ధి వేదిక కన్వీనర్ గంజికుంట నాగరాజు, మాబుషరీఫ్, నాగేశ్వరమ్మ, బాష, నిఫూర్, మహమ్మద్, ఏవాన్, మున్న తదితరులు పాల్గొన్నారు.

## బిసి నేతలకు పదవులు కేటాయింపు పట్ల హర్షం



**ప్రొద్దుటూరు, (సూర్యవాస్తవం):** బిసి నేతలకు పదవులు కేటాయించడం హర్షణీయమని నందమూరి యువసేవాసమితి అధ్యక్షుడు గోమేధికమ్ సుదర్శన్ తెలిపారు. విశాఖజిల్లా గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు యాదవ్ ను తెలుగుదేశంపార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా, అలాగే ఉత్తరాంధ్రకు చెందిన బిసి నాయకుడు, అనకాపల్లి జిల్లా నర్సీపట్నం శాసనసభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు ను ఆంధ్రప్రదేశ్ 16 వ శాసనసభ సభాపతిగా నియమితులై నందులకు వారివురికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియ జేశారు. తెలుగుదేశంపార్టీ పుట్టినప్పటి నుండి అండదండలుగా వుంటున్న వెనుకబడిన తరగతుల వర్గాలకు ఎన్నో సంక్షేమఫలాలు అందించడమే కాకుండా బిసి లకు సమున్నత స్థానం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి హృద యపూర్వక ధన్యవాదములు తెలిపారు. ఇన్నాళ్ళూ నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బిసిలు అంటూ మాయమాటలు చెప్పి ఇప్పుడు దేవాలయం లాంటి పవిత్రమైన శాసనసభలో సభాపతి ఎన్నిక జరుగుతుంటే కనీసం సభాసాంప్రదాయాలు పాటించకుండా అందులో ఒక బిసి వ్యక్తి శాసన సభాపతి అవుతుంటే గైర్హాజరైన వైసిపి శాసనసభ్యులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ లకు వెనుకబడిన కులాల పట్ల ఎంత ప్రేమ వుందో యీ సంఘటనతో తేటతెల్లమవుతుందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో కడప పార్లమెంటరీ తెలుగుదేశంపార్టీ బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పి.ఎస్.సుబ్బరాజు, నందమూరి యువ సేవా సమితి ఉపాధ్యక్షుడు సిజె.వెంకటసుబ్బయ్య, కడప పార్లమెంటరీ తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి కూనపురి రామునాయుడు, కడప పార్లమెంటరీ కార్యదర్శి సి.సిద్ధయ్య, కడప పార్లమెంటరీ దేవాంగ సాధికారికసమితి కన్వీనర్ అంపావతిన నాగసుబ్బరాయుడు(సుబ్బు), తెలుగు యువత నాయకులు సిజె.సమర, ఎస్.సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయంలో ప్రత్యేక పూజలు



**గుంతకల్లు ప్రతినిధి సూర్యవాస్తవం :** గుంతకల్లు నియోజకవర్గం పామిడి పట్టణంలో ఉన్నటువంటి శ్రీ భోగేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం. కావడంతో ఆలయ ప్రధాన అర్చకుడు రాము స్వామి. చంద్ర స్వామి స్వామి వారినిప్రత్యేకఅలంకరణ చేసి స్వామి వారిని అలంకరించారు. అనం తరం ఆలయప్రధాన అర్చకుడు మాట్లా డుతూ ప్రతి సోమవారం. ఏదో అలం కరణ. చేస్తూఉండటం ఆనవాయితీగా. వస్తుంది భక్తాదులు వేలాదిమంది ప్రతి సోమ వారందర్శించుకునేందుకు. వస్తు. ఉంటారుఎందుకంటే ఇక్కడ ఉన్నటు వంటి పరమ పవిత్రమైన శివలింగాన్ని చూసి దర్శించుకున్న వారికి. వెంటనే కోరికలుతీరుతాయనిభక్తులవిశ్వాసనమ్మకమనిఆలయఅర్చకులు తెలియజేశారు

# పత్తికొండలో వినాయక ఘాట్ ఏర్పాటు చేయాలి

– వినాయక చవితి ఉత్సవాలు 5 రోజులకి పెంచాలి ... గణేష్ ఉత్సవ సమితి

**పత్తికొండ (సూర్య వాస్తవం):** పత్తికొండ పట్టణం హొసూరు బైపాస్ హంద్రీనీవా కాలవలో వినాయక ఘాట్ ఏర్పాటు చేయాలనీ అలాగే వినాయక ఊరేగింపు ప్రతి సంవత్సరం మూడు రోజులకు జరిగే ఊరేగింపు ఈ సంవత్సరం నుంచి ఐదు రోజులకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సోమవారం నాడు పత్తికొండలోని గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆర్డీవోకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ సమితి సభ్యులు విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షులు వీర రాజులు, ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రముఖ రామలింగ మాట్లాడుతూ పత్తికొండ పట్టణంలో వినాయక నిమజ్జనం సందర్భంగా నిమజ్జన స్థలంలో ఘాట్ ఏర్పాటు చేయాలనీ డిమాండ్ చేశారు. అలాగే కొన్ని సంవత్సరాల నుండి పత్తికొండ పట్టణంలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకుని వినాయక పండుగను వైభవంగా నిర్వహిస్తున్నామని అయితే వినాయక విగ్రహాలను ఊరేగింపు అనంతరం పట్టణ సమీపంలో హంద్రీనీవా కాలువలో నిమజ్జనం చేస్తూ వస్తున్నామని అయితే హంద్రీనీవా కాలువలో నిమజ్జన సమయంలో ఎటువంటి ఘాట్



లేకపోవడంతో వినాయక విగ్రహాల నిమజ్జనంలో ఇబ్బందులు తలెత్తుతున్నా యన్నారు. కొన్ని సందర్భాలలో భారీ విగ్రహాలు విరిగి పోయి ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రస్తుతం హంద్రీనీవా కాలువలో ఎటువంటి నీరు లేనందున అధికారులు తక్షణమే స్పందించి పట్టణ సమీపంలో హెరీసూరు బైపాస్ రహదారిలో ఉన్న హంద్రీనీవా కాలువదగ్గర వినాయక ఘాట్ ఏర్పాటు చేయాలని వినాయక విగ్రహాల నిమిజ్జనంలో ఎటు వంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకో వాలని గణేష్ ఉత్సవ సమితి సభ్యులు అలాగే ప్రతి సంవత్సరం కూడా కార్తీక మాసం రోజున దీపాలు విడిచే టప్పుడు హంద్రీనీవా కాలవలో భక్తులు జారి పడుతున్నాను కావున మెట్లను ఏర్పాటుచేస్తే బాగుంటుంది గణేష్ సోషల్ సభ్యులు కోరారు . ఈ కార్యక్రమంలో బీజేవైఎం మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరణం నరేష్ ఓబీసీ మర్చ జిల్లా కార్యదర్శిబ్రహ్మయ్య,వివిధవినాయక మండ పాలకార్యదర్శులు, సుధాకర్, చిన్న లింగామయ్య, చిన్న మురళి, కేశవ తదితరులు పాల్గొన్నారు

## జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు పాఠశాలలో 60% రాయితీ కల్పించాలి

**కర్నూల్ (సూర్య వాస్తవం) :** ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నాడు కోడుమూరు ఎంఈఓ కు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న వర్కింగ్ జర్నలిస్టు పిల్లలకు 60% రాయితీ కల్పించాలని వినతి పత్రం అందజేశారు. దానికి వారు సానుకూలంగా స్పందించి రాయితీ కల్పించే విధంగా కృషి చేస్తారని తెలిపారు.





పులివెందుల, వైజాగ్, అనంతపురం, హిందూపురం పట్టణాల్లో నిర్మిస్తున్న ఏపి హౌసింగ్ గృహాలకు, మా బ్రిక్స్ సరఫరా చేశాము. మరియు పులివెందుల మెడికల్ కళాశాల భవనాల నిర్మాణానికి మా బ్రిక్స్(ఆర్‌బిఐ) ను సరఫరా చేశాము. గన్నవరం, రేణిగుంట ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్టు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి, మరియు కడప ఎయిర్‌పోర్టు పార్కింగ్ టైల్స్‌కు సరఫరా చేశామని తెలుపుటకు సంతోషిస్తున్నాము. కాంక్రీట్ బ్రిక్స్,

53 గ్రేడ్ ఓపిసి సిమెంట్‌తో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో
అధునాత సాంకేతిక పరిజ్ఞాంతో కూడిన మిషనరీతో మా వద్ద రోజుకు 50 వేల నుండి లక్ష బ్రిక్స్

పటిష్టమైన (3x4x9)-(6x8x12)-(6x8x16) (4x8x12)-(4x8x16) ఇంటర్ లాకింగ్ బ్రిక్స్, పార్కింగ్ టైల్స్, పెవర్ బ్లాక్స్, కాంపౌండ్ వాల్ ప్లేట్స్, పోల్స్ తయారు చేసి మీరు కోరిన ప్రదేశానికి సప్లై చేయబడును. ట్రాన్స్‌పోర్టు, లోడింగ్ అన్ లోడింగ్ సౌకర్యం కలదు. ఇంకా నిర్మాణ పనులకు కావలసిన మెటీరియల్ సెంటరింగ్, బార్బెండింగ్, స్టీల్ వర్క్ మరియు మ్యాన్ పవర్ సప్లై సౌకర్యము కలదు.

Interlocking Pavers

బ్రిక్స్ కావాల్సిన వారు
ఈ క్రింది నెంబర్లకు సంప్రదించండి.
సెల్ : 7672042522, 8500425222,
8500425111 .







RBI
BRICKS
RELIABLE BRICK INDUSTRIES

ఇట్లు మీ....

## మొగల్ ఇర్షాద్ బేగ్

కదిరి

సెల్ : 76720 42522, 85004 25222,
85004 25111

సూర్య వాస్తవం
http://www.suryavastavam.com
మంగళవారం
25 జూన్ 2024

# సుచి స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉచిత వ్యాపార అవగాహన




**యాదమరి సూర్య వాస్తవం :** యాదమరి మండలం జోడి చింతల సింధియా ఫీల్డ్ ఆఫీస్ కార్యాలయం నందు గ్రామస్థాయి చిన్న తరహా వ్యాపారం పై శిక్షణ, అవగాహన సుచి స్వచ్ఛంద సంస్థ అధినేతలు పాల్ విజయ్ కుమార్ గ్లోరీ విజయకుమార్ ఆధ్వర్యంలో సింధియా ఫీల్డ్ కార్యాలయం నందు జరిగింది. అబ్రహం సంతానం, డైరెక్టర్ సింధియా, ఎగ్జిక్యూట్ డైరెక్టర్ కరుణానిధి, క్లస్టర్ కోఆర్డినేటర్ చార్లెస్ రమేష్, సిఎంసి వేలూరు రుష హాస్పిటల్ సీనియర్ ట్రైనింగ్ ఆఫీసర్ లు ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల యువతి యువకులకు చేతి వృత్తుల నైపుణ్యం స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం వాతావరణ మార్పులు క్లైమేట్ చేంజ్ ద్వారా బడుగు బలహీన పేద యువతీ యువకులకు జీవన నైపుణ్యం చేతివృత్తులపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్ టైలరింగ్ ఆటోమొబైల్ మెకానిజం కంప్యూటర్ ఆదాయ ఉత్పత్తి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు మంజూరు చేసి ఉద్యోగ అవకాశములు కల్పిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా టైలరింగ్ శిక్షణ పొందిన 6 మందికి సంస్థ ద్వారా సర్టిఫికెట్లు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో రుష ఆసుపత్రి ప్రతినిధులు అనీష్ ట్రైనింగ్ ఆఫీసర్ సృశి స్కిల్ ట్రైనింగ్ ఆఫీసర్ సంపత్ ఇన్స్ట్రక్టర్ ఆటో మొబైల్ మెకానిజం సుచి సిబ్బంది ధనలక్ష్మి జాకబ్ జాన్సన్ వరదరాజ్ థామస్ డి.చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి శ్రీకారం

### ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి – జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

**అనంతపురం క్రైం సూర్య వాస్తవం:** అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 410 ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ స్వీకరించడం జరిగింది.ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.– ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అత్యంత ప్రశాంతంగా, శాంతియుతంగా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహించాలని వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలన్నారు. గ్రీవెన్స్ ను ఎప్పటికప్పుడు ఫాలోఅప్ చేయాలని, తక్షణమే స్పందించాల్సినవి, 24 నాలుగు గంటల్లో పరిష్కరించాల్సినవి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వం నుంచి వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు ఆలస్యం కాకుండా తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు ఈ ఆఫీస్ లో నమోదు కాని వారు వెంటనే నమోదు కావాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వికలాంగుల సమస్యలను వారి వద్దకే వచ్చి విని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.– ఈ కార్యక్రమంలో సిపిఓ అశోక్ కుమార్ రెడ్డి, డిపిఓ ప్రభాకర్ రావు, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ జెడి సుబ్రహ్మణ్యం, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, డిసిహెచ్ఎస్ పాల్ డా.రవికుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ భాష, కలెక్టరేట్ ఏవో అంజన్ బాబు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప, డీఆర్డీఏ పిడి నరసింహా రెడ్డి, డ్వామా పిడి వేణుగోపాల్ రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, హార్టికల్చర్ డిడి ఫిరోజ్ ఖాన్, ఏపీఎంఐపి పిడి రఘునాథరెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం సుమంత్, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్, డిటిసి వీర్రాజు, గ్రౌండ్ వాటర్ డిడి తిప్పేస్వామి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజారావు, ఆర్అండ్బి ఎస్ఈ ఓబుల్ రెడ్డి, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డా. కిరణ్ కుమార్ రెడ్డి, డిసిఓ అరుణకుమారి, మైండ్స్ డిడి నాగయ్య, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి రసూల్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు అర్జీదారులు అందించిన ఫిర్యాదుల వివరాలు ఇలా ఉన్నాయి. 1. వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు వసంత్ కుమార్, ఉపాధ్యక్షులు రాజేష్, కుందిర్పి మండల అధ్యక్షులు వెంకటేష్ తదితరులు మాట్లాడుతూ2022ఆగస్టులోవేలాదిమంది వికలాంగుల పింఛన్లను నిలిపివేశారని, వాటిని పునరుద్ధరించాలని, 2019 కన్నా ముందున్న మ్యారేజ్ ఇన్సెంటివ్ లు అందించాలని కోరారు. 2. అనంతపురం జీసస్ నగర్ కు చెందిన రామాంజనేయులు మాట్లాడుతూ తాము నివసిస్తున్న ఇంటికి మున్సిపల్ రికార్డ్స్‌లోరెండువాటర్‌ట్యాప్‌లునమోదు అయ్యాయని, కానీ వాస్తవంగా మాకు ఒకటే ఉన్నదని, రికార్డులలో ఒకటి రద్దు చేయాలని కోరారు.

# ప్రతీ సమస్య పరిష్కారం కావాలి : జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు

**పుట్టపర్తి, సూర్య వాస్తవం** : ప్రతీ సమస్యా పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు పేర్కొన్నారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని స్పందన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తోపాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డిఓ భాగ్యరేఖ, డిపిఓ విజయ్ కుమార్, గ్రామ వార్డు సచివాలయ నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి 106అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి సమస్య పరిష్కారం దిశగా యోచిస్తుందన్నారు. సుపరిపాలన, సమర్థత, అవినీతి రహిత వ్యవస్థ లక్ష్యంగా పనిచేస్తుందని ఆయన చెప్పారు.సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక వెబ్ పోర్టల్‌ను సోమవారం ఉదయం 10 గంటలనుంచి ప్రారంభిస్తోంది. జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్లలో, మున్సిపల్ కార్యాలయాల్లో, మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. అర్జీలను ఇచ్చేందుకు తప్పనిసరిగా ఆధార్, ఫోన్ నంబరు ఇవ్వాలన్నారు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంఖ్య కేటాయిస్తారని దాని ఆధారంగా సమస్య పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకునే వీలుంటుంది అని పేర్కొన్నారు.డయోరియా రహిత జిల్లాగా మార్చేందుకు అధికారులందరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఎక్కడ కూడా త్రాగు నీరు కలుషితం లేకుండా మురికి నీటిగుంట లో లేకుండా పంచాయతీ, మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టిని సారించాలని ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పారిశుద్య చర్యలను విస్తృతంగా చేపట్టాలని, ఓవర్ హెడ్ ట్యాంకుల వద్ద క్లోరిన్ టాబ్లెట్స్ వద్ద బ్లీచింగ్ పౌడర్ వేయాలని విద్యాసంస్థలు, జనసమూహ కూడళ్ళు మార్కెట్ ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులు లోపించకుండా చర్యలు చేపట్టాలని నీటి నిల్వలు ఉన్నచోట గంబూజియా చేపలను పెంచాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా డయేరియా కేసులు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే చికిత్స అందించాలని, జిల్లాలో డయేరియా ను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని దీనికై ప్రత్యేక డ్రై వ్ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలాగే డయేరియాపై అవగాహన కల్పించే విధంగా ప్రచార కార్యక్రమం నిర్వహించాలన్నారు. క్షేత్ర స్థాయిలో సంబధిత అధికారులు పర్యటించి డయేరియా ప్రభావం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని ఆరోగ్య కేంద్రాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్లు అందుబాటులో ఉండాలన్నారు. జిల్లాలో డయేరియా అరికట్టేందుకు దశల వారీగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఉన్న అన్నీ మున్సిపాలిటీలోనూ మంచినీటి ట్యాంక్ లను శుభ్రపరచాలని, శుభ్రపరచేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. త్రాగు నీరుసమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మంచి నీటి పైపులు ఎక్కడైనా లీకులు ఉన్నాయా లేదో తనిఖీ చేసి, లీకులు ఉంటే పైపులు మార్చాలని మున్సిపల్ కమీషనర్లను కలెక్టర్ ఆదేశించారు. డ్రైనేజీ ప్రదేశంలో మంచి నీటి పైపులు లీకులు ఉంటే మంచి నీరు కలుషితం అయ్యే అవకాశం ఉందని ఆ నీరు తాగి ప్రజల ఆరోగ్యం పాడైతే మున్సిపల్ కమీషనర్లు, ఇంజనీరింగ్, శానిటేషను, ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులపై తీవ్ర చర్యలు ఉంటాయని అధికారులను కలెక్టర్ హెచ్చరించారు.ఈరోజునిర్వహించినప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలల నుండి ప్రజలు హాజరై వివిధ సమస్యలతో కూడిన వినతులను సమర్పించారు. 106 దాకా అర్జీలు వచ్చాయి. ఇందులో కొన్ని వివరాలు ఇలా ఉన్నాయి. గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామానికి చెందిన రైతులకు సంబంధించి 716 జి. హైవే కొరకు అలార్టు అయినదని, అయితే ఇంతవరకు నష్టపరిహారం అందలేదని అలాగే బూదిలి గ్రామ పొలం సర్వేనెంబర్ 722-1 బి లోని కొంతమేరకు భూమి పుట్టపర్తి కోడూరు రహదారి విస్తరణ పనులకు రైతుల నుండి తీసుకోవడం జరిగిందని అయితే ఇంతవరకు నష్టపరిహారం అందలేదని పేర్కొంటూ రామిరెడ్డి, జయ చంద్రారెడ్డి, నాగభూషణంతదితరులుకలెక్టర్‌కువినతి పత్రం అందజేశారు.

# కలెక్టర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు



**చిత్తూరు సూర్య వాస్తవం** : చిత్తూరు జిల్లా నూతన కలెక్టర్ గా సోమవారం బాధ్యతలు స్వీకరించిన సుమిత్ కుమార్ ను మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి పాతలపాటి మనోహర్,లు కలిసిశుభాభినందనలుతెలియజేశారు.నేడురేపురెండు రోజులపాటుకుప్పం నియోజకవర్గ పర్యటనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రానున్నారు. ఈనేపథ్యంలోముఖ్యమంత్రిపర్యటనఏర్పాట్లను పరిశీలించడానికికలెక్టర్‌సుమిత్‌కుమార్,డీఐజీ షెమోషి, ఎస్పీ మణికంఠ చందోలు, ఇతరరాష్ట్రస్థాయి జిల్లా స్థాయి అధికారులు అందరూకుప్పంకు విచ్చేశారు.

# ఇంటర్మీడియట్ విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన



**యాదమరి సూర్య వాస్తవం:** యాదమరి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం చిత్తూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు సర్కిల్ ఇన్స్పెక్టర్‌హరికృష్ణ మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన కల్పిస్తూ ఎక్కువమంది యువకులు మత్తు పదార్థాలకు బానిసలై జీవితాన్ని పాడు చేసుకుంటున్నారని విద్యార్థులు మంచి నడవడికలు కలిగి ఉండాలని, యువకులు జీవితంలో మంచి విద్యార్థులుగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి సేవలో పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్

**ఐరాల సూర్య వాస్తవం:** ఐరాల మండలం కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారిని పూతలపట్టు శాసన సభ్యులుగా డాక్టర్ కలికిరి మురళీ మోహన్ ప్రమాణస్వీకారం చేసిన మొట్టమొదటిసారిగా దర్శించుకున్నారు. తర్వాత ఆలయం వద్ద గల అన్న ప్రసాదం వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.వీరికి ఆలయ సిబ్బంది సాధారణ స్వాగతం పలికి స్వామి వారి దర్శనం ఏర్పాట్లు చేశారు. మూషిక మండపం వద్ద వేద పండితులచే ఆశీర్వచనాలు నిర్వహించారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను ఆలయ ఈవో వెంకటేశు అందించారు. ఆలయ సిబ్బంది విధి నిర్వహణ లో వస్త్రధారణ కలిగి నుదుటిపై తిలకం బొట్టు ఉండాలని ఎమ్మెల్యే మురళీమోహన్ ఆలయ సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో ఆలయఅధికారులు, ఆలయ ఉభయదారులు కాకర్ల హేమాద్రి నాయుడు, బంగారుపాళ్యం మండల అధ్యక్షులు ఎన్ పీ జయప్రకాష్ నాయుడు పూతలపట్టునియోజవర్గ టిడిపి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

